ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

నవంబర్ 1 ఆదివారం 2026 | సంపుటి : 1 | సంచిక : 23 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

SUNDAY NOVEMBER 1 2026 | VOL:1 | ISSUE: 23 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM



తేని జైలు ఘటనపై సీఎం విజయ్ సీరియస్.. అధికారులకు కీలక ఆదేశాలు



- తేని జైలు నుంచి 17 మంది ఖైదీలు పరారైన ఘటన
- జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌పై సస్పెన్షన్ వేటు
- మరో సీనియర్ అధికారి బదిలీ, 9 మంది సిబ్బంది సస్పెండ్
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలని హెచ్చరిక

తమిళనాడులోని తేని జిల్లా జైలు నుంచి 17 మంది విచారణ ఖైదీలు పరారైన ఘటనపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. ఈ ఘటనలో బాధ్యులను చేస్తూ తేని జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌ను సస్పెండ్ చేయగా, మరో సీనియర్ అధికారిని బదిలీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జైళ్లలో భద్రతను కట్టుదిట్టం చేయాలని, నిఘాను పటిష్ఠం చేయాలని

(మిగతా 3వ పేజీలో..)

ఇస్రో శాస్త్రవేత్తలకు సీఎం రేవంత్ అభినందనలు


- ఉపగ్రహ ప్రయోగం విజయవంతం కావడంపై హర్షం
- శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందికి ప్రశంసలు
- భూస్థిర కక్ష్యలోకి చేరిన ఎన్‌వీఎస్-03 ఉపగ్రహం
- కీలక రంగాలకు మెరుగైన సేవలు అందించనున్న ఉపగ్రహం
- ఇస్రో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష



హైదరాబాద్, అక్టోబర్ 31 ( ):

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 నావిగేషన్ ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించడంపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సిబ్బందికి అభినందనలు తెలియజేశారు. ఉపగ్రహాన్ని నిర్దేశిత భూస్థిర కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడం భారత నావిగేషన్ వ్యవస్థ సామర్థ్యాన్ని మరింత పెంపొందించే కీలక ఘట్టమని ప్రశంసించారు. ఈ ఉపగ్రహం ద్వారా రవాణా, విమానయానం, సముద్ర మార్గాల గుర్తింపు, పర్యవేక్షణతో పాటు అత్యవసర సేవలు వంటి కీలక రంగాలకు మరింత మెరుగైన సేవలు అందుబాటులోకి రానున్నాయని పేర్కొన్నారు. ఇస్రో సాధించిన ఈ విజయం యావత్ దేశానికి గర్వకారణమని, భవిష్యత్తులోనూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరిన్ని విజయాలు సాధించి దేశ కీర్తిని ప్రపంచవ్యాప్తంగా చాటాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

మధ్యంతర ఎన్నికల్లో పరాభవం ఎదురైతే ఇరాన్‌కు మూడినట్లేనా? ట్రంప్ ప్లాన్స్ ఏంటి?



- రిపబ్లికన్లు ఓడితే ఇరాన్‌పై భారీ దాడికి ట్రంప్ మొగ్గు చూపవచ్చని సమాచారం
- ఎన్నికల ఫలితాలకు ఇరాన్ నిర్ణయాలకు సంబంధం లేదన్న వైట్‌హౌస్
- ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లో దాడులకు సిద్ధంగా ఉన్న అమెరికా బలగాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై మరోసారి భారీ సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. నవంబర్ 3న జరగనున్న అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ ఘోర పరాజయం ఎదుర్కొంటే, ట్రంప్ మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉందని ఓ అమెరికా అధికారి వెల్లడించినట్లు ఆక్సియోస్ కథనాన్ని ఉటంకిస్తూ న్యూస్18 పేర్కొంది. అయితే ఎన్నికల ఫలితాలు ఇరాన్‌పై నిర్ణయాలను ప్రభావితం చేయవని వైట్‌హౌస్ అధికారి ఈ వాదనను తోసిపుచ్చారు. రిపబ్లికన్లు ఎన్నికల్లో భారీగా నష్టపోతే ట్రంప్ తన రాజకీయ ప్రతిష్ఠకు భంగం కలిగిందని భావించి ఏదైనా పెద్ద నిర్ణయం తీసుకోవచ్చని ఓ అమెరికా అధికారి చెప్పినట్లు నివేదిక తెలిపింది. ఈ సందేశాన్ని ఇరాన్ అధికారులకు కూడా చేరవేస్తున్నారని పేర్కొంది. ఒప్పందం కుదుర్చుకోవడానికి

(మిగతా 3వ పేజీలో..)

ఎల్‌నినో ఎఫెక్ట్.. తాగునీటి కోసం రూ.120 కోట్లు.. మంత్రి సీతక్క కీలక నిర్ణయం



- ఎల్‌నినో ప్రభావం ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు
- నాలుగు జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయానికి రూ.120 కోట్లు
- ఇతర జిల్లాలకు ఒక్కోటి రూ.కోటి చొప్పున నిధులు
- బోరుబావులు, ట్యాంకర్లతో నీటి సరఫరాకు ఏర్పాట్లు
- స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని ఆదేశం

ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తెలంగాణ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రత్యామ్నాయ తాగునీటి ఏర్పాట్ల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేసింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాల కోసం రూ.120 కోట్లు కేటాయించినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఇతర జిల్లాల్లో తక్షణ అవసరాల కోసం ఒక్కో జిల్లాకు రూ.కోటి చొప్పున నిధులు ఆమోదించినట్లు తెలిపారు.రాష్ట్రంలో తాగునీటి సరఫరా పరిస్థితి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై శనివారం ఉదయం మిషన్ భగీరథ, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి ఎద్దడి ఎదురయ్యే ప్రాంతాల్లో స్థానిక నీటి వనరులను వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన చోట బోరుబావులను అద్దెకు తీసుకోవడంతో పాటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేందుకు రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు.చేతిపంపులు, సింగిల్ ఫేజ్, త్రీ ఫేజ్ నీటి సరఫరా పథకాలు,

(మిగతా 3వ పేజీలో..)

ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకు అప్పగిస్తారా?: ఐడీబీఐ డీల్‌పై కేటీఆర్ ఫైర్

- బ్యాంకు ఆస్తుల విలువను ఉద్దేశపూర్వకంగా తగ్గిస్తున్నారని ఆరోపణ
- రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వస్తే నిబంధనలు మార్చడంపై ప్రశ్నలు
- ఉద్యోగుల ఆందోళనలను కేంద్రం ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపాటు



ఐడీబీఐ బ్యాంకు ప్రైవేటీకరణ ప్రతిపాదనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కేంద్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు జాతి సంపదని, వాటి విలువను ఉద్దేశపూర్వకంగా తక్కువ చేసి అమ్మజూపడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. “ఐడీబీఐ బ్యాంకు విలువను తక్కువగా అంచనా వేస్తున్నారనే నివేదికలు ఆందోళన కలిగిస్తున్నాయి. రిజర్వ్ ధర కంటే తక్కువకు బిడ్లు వచ్చినప్పుడు నిబంధనలు, మదింపు పద్ధతులను ఎందుకు మార్చారు? ఐడీబీఐ ఉద్యోగులు లేవనెత్తుతున్న ఆందోళనలను ఎందుకు పట్టించుకోవడం లేదు?”

(మిగతా 3వ పేజీలో..)

రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్..భూములను కాపాడిందే బీఆర్ఎస్ : మాజీ మంత్రి హరీష్‌రావు



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మియాపూర్ భూముల విషయంలో బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ మంత్రి హరీష్‌రావు విమర్శించారు. రేవంత్ రెడ్డి అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ ా నిలిచిపోనున్నారని దుయ్యబట్టారు. సీఎంకు అబద్ధాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని వ్యాఖ్యనించారు.మియాపూర్ భూములు తెలంగాణ ప్రభుత్వానికి చెందినవేనని సుప్రీంకోర్టు వెల్లడించిన నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. అబద్ధాలతో క్రెడిట్ చోరీలకు పాల్పడుతున్నారని విమర్శించారు. మియాపూర్ భూముల విషయంపై సుప్రీం కోర్టు జడ్జిమెంట్ కాపీ కూడా ఇంకా రాకముందే ఆ భూములను అమ్ముకోవాలనే ఆతృత సీఎంలో కనిపించిందని ఆరోపించారు.కేసీఆర్ సీఎం అయ్యాక వైద్యనాథన్ అనే సీనియర్ అడ్వకేట్‌ను నియమించి భూములు ప్రభుత్వానికి దక్కేలా న్యాయపోరాటం చేసి కాపాడారని గుర్తు చేశారు. మంచిరేవులలో 142 ఎకరాలు కాపాడామని గొప్పలు చెప్పుకుంటే కాంగ్రెస్ ఆ భూములు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేలా ప్రయత్నించిందని పేర్కొన్నారు. మంచిరేవుల్లోని 10 ఎకరాల భూమిని ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టారని విమర్శించారు. భూపాలపల్లి భూములు, హయాత్‌నగర్‌లోని భూములను కాపాడేందుకు బీఆర్ఎస్ అన్నిరకాలుగా కాపాడిందని ఆరోపించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూములను తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లను రేవంత్ రెడ్డి అప్పుగా తెచ్చుకున్నారని వెల్లడించారు.

(మిగతా 3వ పేజీలో..)

ఇస్రో ప్రయోగం సక్సెస్.. శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు

- జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహం విజయవంతం
- ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ప్రధాని మోదీ అభినందనలు
- స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ ‘నావిక్’ బలోపేతం అవుతుందని వెల్లడి
- కీలక సాంకేతికతల్లో ఆత్మనిర్భరతకు ఈ ప్రయోగం దోహదపడుతుందని వ్యాఖ్య

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ఖాతాలో మరో అద్భుత విజయం చేరింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్18 రాకెట్ ద్వారా ఎన్‌వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల బృందాన్ని ఆయన అభినందించారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్

(మిగతా 3వ పేజీలో..)



తెలంగాణకు ఐదు రోజుల వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్

- అల్పపీడన ప్రభావంతో తెలంగాణలో ఐదు రోజుల వర్ష సూచన
- నేటి నుంచి నవంబర్ 4 వరకు వానలు కురిసే అవకాశం
- హైదరాబాద్ సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

(మిగతా 3వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

తేని జైలు ఘటనపై సీఎం విజయ్

సీరియస్.. అధికారులకు కీలక ఆదేశాలు

మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి విజయ్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. తేని జైలు సూపరింటెండెంట్ నాగేశ్వరన్‌ను అక్టోబర్ 30 నుంచి తదుపరి ఆదేశాలు జారీ చేసేంతవరకు సస్పెండ్ చేశారు. అదేవిధంగా మధురై సెంట్రల్ జైలు సూపరింటెండెంట్‌గా ఉన్న ఆర్. కృష్ణరాజ్‌ను సేలం సెంట్రల్ జైలుకు బదిలీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని సీఎం విజయ్ హెచ్చరించారు.అక్టోబర్ 26న తేని జిల్లాలోని టెక్కంపట్టి సబ్-జైలులో ఈ ఘటన జరిగింది. వైద్యపరమైన అత్యవసర పరిస్థితిని సృష్టించిన ఖైదీలు, జైలు గార్డులపై దాడి చేసి, వారి నుంచి తాళాలు లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనపై వెంటనే స్పందించిన పోలీసులు, ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి పరారైన 17 మందినీ తిరిగి పట్టుకున్నారు. ఈ జైలు బ్రేక్ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా జైళ్ల భద్రతపై ప్రభుత్వం సమీక్ష ప్రారంభించింది. ఇప్పటికే ఈ ఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై 9 మంది జైలు సిబ్బందిని సస్పెండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిఘా వ్యవస్థను మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం వంటి చర్యలు చేపడుతున్నారు.

సీఈసీపై ఇండియా కూటమి 'ప్రజా అభిశంసన'..

బీజేపీ గెలుపు చట్టవిరుద్ధమన్న రాహుల్

13.3 కోట్ల ఓట్లను జాబితా నుంచి తొలగించారని రాహుల్ గాంధీ ఆరోపణ

2024 లోక్‌సభ ఎన్నికలు చట్టవిరుద్ధమని, బీజేపీ గెలుపు అక్రమమని వ్యాఖ్య

ప్రభుత్వం దేశ ఆత్మపై దాడి చేస్తోందని మల్లికార్జున ఖర్గే విమర్శ


ఎన్నికల సంఘం పనితీరుకు వ్యతిరేకంగా 19 విపక్ష పార్టీల నిరసన

2024 లోక్‌సభ ఎన్నికల చట్టబద్ధతను ప్రశ్నిస్తూ కాంగ్రెస్ అగ్రనేత, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. భారీ ఎత్తున ఓటర్ల జాబితా నుంచి పేర్లను తొలగించడం ద్వారా ఎన్నికల ప్రక్రియనే అపహాస్యం చేశారని, బీజేపీ ఎంపీలు అక్రమంగా లోక్‌సభలో అడుగుపెట్టారని ఆయన ధ్వజమెత్తారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా 'ఇండియా' కూటమి శనివారం నిర్వహించిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమంలో రాహుల్ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో ఏర్పాటు చేసిన ఈ మాక్ పార్లమెంట్ కార్యక్రమంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ, "దేశవ్యాప్తంగా సుమారు 13.3 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారు. ఇది మొత్తం ఓటర్లలో దాదాపు 15 శాతానికి సమానం. అనేక నియోజకవర్గాల్లో గెలుపు మార్జిన్ కేవలం 3 శాతం మాత్రమే ఉన్నప్పుడు, ఇంత పెద్ద సంఖ్యలో ఓట్లను తొలగించడం ఎన్నికల నిష్పాక్షికతపై తీవ్రమైన సందేహాలు రేకెత్తిస్తోంది" అని అన్నారు."2024 లోక్‌సభ ఎన్నికలు చట్టవిరుద్ధంగా జరిగాయని, బీజేపీ సభ్యులు అక్రమంగా పార్లమెంటులోకి ప్రవేశించారని స్వయంగా ఎన్నికల సంఘమే పరోక్షంగా అంగీకరిస్తోంది" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్న నాయకత్వం తనను కాపాడుతుందని సీఈసీ భావిస్తే పొరపాటని, ప్రజల ఆగ్రహాన్ని గమనించాలని హెచ్చరించారు. "మీరు ఓట్ల దొంగతనానికి సహకరిస్తూనే ఉండండి. కానీ వీధుల్లో ఉన్న ప్రజలు మీరు వారికి చేసిన ద్రోహాన్ని ఎప్పటికీ మర్చిపోరని నేను హామీ ఇస్తున్నాను" అని ఆయన అన్నారు.ఈ కార్యక్రమానికి లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించారు. సీఈసీకి వ్యతిరేకంగా లాంఛనప్రాయ ప్రజా అభిశంసనను ఖర్గే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం దేశ ఆత్మపైనే దాడి చేస్తోందని, పార్లమెంటులో మాట్లాడేందుకు ప్రతిపక్షాలకు కనీస అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎన్నికల సంఘం పనితీరుకు వ్యతిరేకంగా తమ నిరసనను తెలియజేసేందుకే ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఇండియా కూటమి నేతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొత్తం 19 రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు.



బంగాళాఖాతంలో కొత్త వాయుగుండం.. ఇస్రో శాటిలైట్ కెమెరాకు చిక్కిన దృశ్యాలు

బంగాళాఖాతంలో మరో తుపాను రూపుదిద్దుకుంటోంది. అర్నబ్ తుపాను తీరం దాటిన కొద్ది రోజులకే, ఆగ్నేయ బంగాళాఖాతంలో మేఘాలు దట్టంగా ఏర్పడి ఒక వ్యవస్థగా మారుతున్న దృశ్యాలను ఇస్రోకు చెందిన ఇన్ శాట్-3డీఎస్ శాటిలైట్ శనివారం ఉదయం గుర్తించింది. ఈ వ్యవస్థ ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతుండటంతో అధికారులు దీనిని నిశితంగా గమనిస్తున్నారు.అక్టోబర్ 29న దక్షిణ అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో అల్పపీడనంగా మొదలైన ఈ వ్యవస్థ, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. అక్టోబర్ 31 సాయంత్రం నాటికి ఇది వాయుగుండంగా బలపడింది. రానున్న రెండు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదిలే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేస్తోంది. తాజా శాటిలైట్ చిత్రాల్లో ఒక సుడి లాగా వాయుగుండం స్పష్టంగా కనిపిస్తోంది.దీని ప్రభావంతో దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవుల్లో, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడవచ్చని, ఆ సమయంలో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. అయితే, ప్రస్తుతానికి పోర్టులకు ఎలాంటి హెచ్చరికలు జారీ చేయలేదు.



ప్రభుత్వ బ్యాంకును ప్రైవేటుకు అప్పగిస్తారా?: ఐడీబీఐ డీల్‌పై కేటీఆర్ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

అని కేటీఆర్ ప్రశ్నించారు. హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన నగరాల్లో బ్యాంకుకు అత్యంత విలువైన భూములు, స్థిరాస్తులు ఉన్నాయని, వాటి విలువను సరిగ్గా లెక్కించారా? లేదా? అని నిలదీశారు. "ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ రంగ బ్యాంకును ప్రైవేటుపరం చేసే ముందు కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు స్పష్టమైన సమాధానాలు చెప్పాలి. ఇంత తొందర ఎందుకు?" అని ఆయన అన్నారు.

తెలంగాణకు ఐదు రోజుల వర్ష సూచన.. పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్

మొదటి పేజీ తరువాయి)

అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలోని పలు జిల్లాల్లో రానున్న ఐదు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. నేటి నుంచి నవంబర్ 4వ తేదీ వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో వార్నింగ్ జారీ చేసింది.వాతావరణ శాఖ నివేదిక ప్రకారం, అల్పపీడనం వాయుగుండంగా బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు కదులుతోంది. దీని ప్రభావంతో ఈరోజు సాయంత్రం ఉమ్మడి వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలతో పాటు యాదాద్రి భువనగిరి, సిద్దిపేట జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. రేపు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు పడతాయని అంచనా వేసింది. ముఖ్యంగా నవంబర్ 2, 3 తేదీల్లో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. నవంబర్ 2న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో, నవంబర్ 3న నిర్మల్, నిజామాబాద్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడతాయని పేర్కొంది. వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు మెరుపుల సమయంలో సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం పొందాలని అధికారులు సూచించారు.

ఎల్‌నినో ఎఫెక్ట్.. తాగునీటి కోసం రూ.120 కోట్లు.. మంత్రి సీతక్క కీలక నిర్ణయం

మొదటి పేజీ తరువాయి)

బావులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మిషన్ భగీరథ సరఫరాకు అంతరాయం ఏర్పడే గ్రామాలు, భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేశారు. నీటి పొదుపు, ఎల్‌నినో ప్రభావంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఇటీవల హైదరాబాద్, మేడ్చల్, ఖమ్మం, యాదాద్రి తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షపు నీటిని భూగర్భంలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సీతక్క సూచించారు. తాగునీటి వనరుల వద్ద ఉన్న ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్లలోకి నీరు చేరేలా చూడాలని, నిర్మాణంలో ఉన్న పనులను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మధ్యంతర ఎన్నికల్లో పరాభవం ఎదురైతే ఇరాన్‌కు మూడినట్లేనా? ట్రంప్ ప్లాన్స్ ఏంటి?

మొదటి పేజీ తరువాయి)

ఇదే సరైన సమయమని వారికి చెబుతున్నట్లు వివరించింది.మరోవైపు, అమెరికా-ఇరాన్ మధ్య చర్చలను తిరిగి ప్రారంభించేందుకు ఖతార్ మధ్యవర్తులు ప్రయత్నిస్తున్నారు. శుక్రవారం టెహ్రాన్‌లో 12 గంటలకు పైగా చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ చర్చల్లో కొంత సానుకూల పురోగతి కనిపించిందని ఓ దౌత్యవేత్త పేర్కొన్నారు. శనివారం దోహాలోనూ చర్చలు కొనసాగనున్నాయి. అణు కార్యక్రమంపై రాయితీలు ఇవ్వాలని అమెరికా కోరుతుండగా.. ముందుగా నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని, నిలిపివేసిన నిధులను విడుదల చేయాలని, చమురు విక్రయాలకు అనుమతించాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. ట్రంప్ ఆదేశిస్తే 96 గంటల్లోనే ఇరాన్‌పై కొత్త సైనిక చర్యలు ప్రారంభించేందుకు అమెరికా బలగాలు సిద్ధంగా ఉన్నాయని ఇటీవల సీఎన్ఎన్ కథనం వెల్లడించింది. ఇరాన్‌లోని ఇంధన వనరులు, సైనిక స్థావరాలు, అణు కేంద్రాలు లక్ష్యంగా దాడులు జరిగే అవకాశం ఉందని అమెరికా అధికారులను ఉటంకించింది. అయితే తుది నిర్ణయం ట్రంప్ తీసుకోవాల్సి ఉందని స్పష్టం చేసింది. అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ వాతావరణం నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి. అయితే దాడులకు సంబంధించి ట్రంప్ నుంచి ఇప్పటివరకు తుది ఆదేశాలు వెలువడలేదు.

ఇస్రో ప్రయోగం సక్సెస్.. శాస్త్రవేత్తలకు ప్రధాని మోదీ అభినందనలు

మొదటి పేజీ తరువాయి)

'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు. "జీఎస్ఎల్వీ-ఎఫ్18 ద్వారా ఎన్వీఎస్-03 ఉపగ్రహాన్ని విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు నా అభినందనలు. మన స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ 'నావిక్'ను బలోపేతం చేయడంలో ఈ ప్రయోగం ఒక ముఖ్యమైన ముందడుగు" అని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక సామర్థ్యాలతో కూడిన ఈ ఉపగ్రహం, కీలక సాంకేతికతల్లో దేశం ఆత్మనిర్భరత సాధించేందుకు మరింత దోహదపడుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన నావిగేషన్ సేవలు అందించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. మన అంతరిక్ష శాస్త్రవేత్తల అంకితభావం, నైపుణ్యం దేశానికి గర్వకారణంగా నిలుస్తున్నాయని మోదీ కొనియాడారు.'నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టలేషన్' (నావిక్) అనేది భారత్ సొంతంగా అభివృద్ధి చేసుకున్న ప్రాంతీయ నావిగేషన్ వ్యవస్థ. అమెరికాకు చెందిన జీపీఎస్ తరహాలోనే ఇది పనిచేస్తుంది. దేశ భద్రత, రవాణా, విపత్తుల నిర్వహణ, పౌర సేవలు వంటి అనేక రంగాల్లో కచ్చితమైన పొజిషనింగ్, టైమింగ్ సేవలను అందించడం దీని లక్ష్యం.ప్రస్తుతం ప్రయోగించిన ఎన్వీఎస్-03, నావిక్ కోసం రూపొందించిన రెండో తరం ఉపగ్రహాల్లో ఒకటి. ఇది నావిక్ వ్యవస్థకు మరింత శక్తిని అందించి, దాని సేవలను మరింత విస్తృతం చేయనుంది. ఈ ఉపగ్రహంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన అటామిక్ క్లాక్ ఉండటం విశేషం. ఈ విజయంతో అంతరిక్ష రంగంలో స్వావలంబన దిశగా భారత్ మరో కీలక ముందడుగు వేసినట్లయింది.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 ఆఖరు గడువు

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఫారం-18 దరఖాస్తుల స్వీకరణ

వరంగల్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 చివరి తేదీ అని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. అర్హులైన పట్టభద్రులు గడువులోగా ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసి ఉండాలి

2026 నవంబర్ 1ను అర్హత తేదీగా పరిగణిస్తామని, 2023 అక్టోబర్ 31 నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ పూర్తి చేసిన వారు ఓటరు నమోదుకు అర్హులని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు

పట్టభద్రులు తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి వెబ్‌సైట్ https://ceotelangana.nic.in ద్వారా ఆన్‌లైన్‌లో ఫారం-18 సమర్పించవచ్చని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో విద్యార్హత ధ్రువపత్రాలను జతచేసి సంబంధిత ఎన్నికల అధికారి కార్యాలయాల్లో అందజేయవచ్చని, పోస్టు ద్వారా కూడా పంపవచ్చని పేర్కొన్నారు. అన్ని విధానాల్లోనూ అవసరమైన ధ్రువపత్రాలు సమర్పించడం తప్పనిసరి అన్నారు.

అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో అర్హత కలిగిన పట్టభద్రులెవరూ ఓటరు నమోదుకు దూరం కావొద్దని కలెక్టర్ కోరారు. రాజకీయ పార్టీలు, పట్టభద్రుల సంఘాలు, విద్యాసంస్థలు, ఉద్యోగ సంఘాలు ఓటరు నమోదుపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. దరఖాస్తులను ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియపై సందేహాలు లేదా ఫిర్యాదులు ఉంటే సంబంధిత ఎన్నికల నమోదు అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకుని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామి కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

ఘనంగా 14వ వార్డు కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు జన్మదిన వేడుకలు

మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకుల మధ్య కేక్ కట్ చేసి శుభాకాంక్షలు

హుజూర్‌నగర్, అక్టోబర్ 31,(ప్రజానేస్తం జ్వాల):

హుజూర్‌నగర్ మున్సిపాలిటీ కార్యాలయంలో 14వ వార్డు కౌన్సిలర్, ఐూ= ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి కవిత బాబురావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస్ గౌడ్, గౌరవ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోతి సంపత్ రెడ్డితో పాటు కౌన్సిలర్లు పులిచింతల వెంకటరెడ్డి, అట్లూరి మంజులమ్మ, దొంతిరెడ్డి పద్మమ్మ, జక్కుల మల్లయ్య, బెల్లంకొండ శ్రీనివాస్, కోళ్ల నాగేశ్వరరావు, చెన్నగాని సైదులు, నందిగామ శ్రీనివాస్, మోదాల సైదులు, ఎడ్ల విజయ్, కోడి ఉపేందర్, నల్లగొండ సుజాత చంటి, చిట్టిపోతుల రమేష్, అమరారపు ప్రవీణ్, చిన్నపంగు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ దగ్గుపాటి కవిత బాబురావు కేక్ కట్ చేయగా, హాజరైన ప్రజాప్రతినిధులు, నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.తన జన్మదిన వేడుకల్లో పాల్గొని ఆప్యాయతతో



శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులందరికీ దగ్గుపాటి కవిత బాబురావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.ఆత్మీయత, అభిమానాల నడుమ ఆనందోత్సాహంగా సాగిన ఈ జన్మదిన వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

మిర్యాలగూడలో లీగల్ మెట్రాలజీ అధికారుల తనిఖీలు.. 8 కేసులు నమోదు

మిర్యాలగూడ, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో లీగల్ మెట్రాలజీ అధికారులు రైస్ మిల్లులు, బియ్యం విక్రయ దుకాణాల్లో మెరుపు తనిఖీలు నిర్వహించారు. ఐదు రైస్ మిల్లులు, మూడు బియ్యం దుకాణాలను తనిఖీ చేసి నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి మొత్తం 8 కేసులు నమోదు చేశారు.బియ్యం బస్తాలపై ప్రకటించిన నికర బరువును వినియోగదారులు పరిశీలించాలని, బస్తా బరువును మినహాయించి బియ్యం అసలు బరువును తూకం వేయించుకోవాలని అధికారులు సూచించారు. వ్యాపారులు తూనికలు, కొలతల చట్ట నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఉల్లంఘనలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



సూర్యాపేట మున్సిపాలిటీకి రెండో విడతలో 657 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

సూర్యాపేట, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో రెండో విడతలో 657 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఇప్పటికే 319 ఇళ్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. శనివారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.పట్టాలు పొందిన లబ్ధిదారులు వారం రోజుల్లో నిర్మాణాలు ప్రారంభించి, 100 రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. బేస్‌మెంట్, లింటెల్, రూఫ్ లెవల్ దశల్లో నిర్మాణ పురోగతిని బట్టి విడతల వారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. 400 నుంచి 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిబంధనలకు అనుగుణంగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు.మున్సిపల్ చైర్‌పర్సన్ మోరిశెట్టి నివేదిత లక్ష్మాద మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల ద్వారా నిర్మాణ రంగ కార్మికులకు, స్థానిక వ్యాపారులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో కొత్త పెన్షన్ల కోసం సుమారు 3,100 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు, అర్హులకు పెన్షన్లు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ జబ్బర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి,



మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, అధికారులు, కౌన్సిలర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నల్లగొండ కిసాన్ సభ మహాసభలను జయప్రదం చేయాలి

సూర్యాపేట, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండలో నిర్వహించనున్న అఖిలభారత కిసాన్ సభ 36వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం కేంద్ర కమిటీ సభ్యులు జూలకంటి రంగారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం సూర్యాపేటలో జరిగిన తెలంగాణ రైతు సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు.నవంబర్ 15న ఎన్జీ కళాశాల మైదానంలో రైతులతో భారీ ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 14న జరిగే రైతు ఎగ్జిబిషన్‌లో వ్యవసాయ రంగ చరిత్ర, రైతాంగ ఉద్యమాలు, ప్రస్తుత వ్యవసాయ పరిస్థితులకు సంబంధించిన అంశాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు. మహాసభలకు దేశవ్యాప్తంగా 850 మందికి పైగా ప్రతినిధులు, పరిశీలకులు హాజరవుతారని వెల్లడించారు.రైతులు ఎదుర్కొంటున్న పెట్టుబడి ఖర్చులు, గిట్టుబాటు ధరలు, అప్పుల భారం వంటి సమస్యలపై మహాసభల్లో చర్చించనున్నట్లు రంగారెడ్డి తెలిపారు. రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి సమగ్ర చర్యలు అవసరమని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లా నుంచి రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లు నాగార్జున్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కందాల శంకర్ రెడ్డి, కోట గోపి, బెల్లంకొండ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



మానవత్వం చాటుకున్న సర్పంచ్.. మృతురాలి కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం

ధర్మసాగర్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



ధర్మసాగర్ మండలంలోని కేశవనగర్ గ్రామానికి చెందిన గంగారపు ఎల్లమ్మ (భర్త సాయిలు) మరణించిన విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ గంగారావు జయ రాజేందర్ వెంటనే స్పందించారు. మృతురాలి కుటుంబ ఆర్థిక పరిస్థితిని గుర్తించి, వారి కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలవడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గోరంట్ల సాధన్ రాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు బొజ్జ రమేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొని మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

వేలేరులో వాటర్ ట్యాంక్ మరమ్మతు పనులు ప్రారంభం

వేలేరు, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



వేలేరు మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్ సమీపంలోని వాటర్ ట్యాంక్‌కు గ్రామపంచాయతీ నిధులతో నూతన మెట్లు, వాటర్ పైపులైన్, ఇతర మరమ్మతు పనులను సర్పంచ్ బిల్లా యాదగిరి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. పాత మెట్లు శిథిలావస్థకు చేరుకోవడం, పైపులైన్ సమస్యల కారణంగా సిబ్బంది, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ఈ పనులు చేపట్టినట్లు తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేసి నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకర్, వార్డు సభ్యులు చైతన్య, లక్ష్మీనారాయణ, సురేష్, సునీల్, గ్రామ పెద్దలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పెద్దకోడపాకలో ఘనంగా పౌర హక్కుల దినోత్సవం

పెద్దకోడపాక, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లా పెద్దకోడపాక గ్రామంలో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, పౌరుల బాధ్యతలు, చట్టాలపై అవగాహన కల్పించారు.ప్రతి పౌరుడికి సమానత్వపు హక్కు, స్వేచ్ఛా హక్కు, జీవించే హక్కు, విద్యా హక్కు, మత స్వేచ్ఛ వంటి హక్కులు రాజ్యాంగం ద్వారా కల్పించబడ్డాయని వివరించారు. కుల, మత, వర్గ, ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ సమాన హక్కులు పొందేందుకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుందని తెలిపారు.అంటరానితనం, కులవివక్ష, సామాజిక అసమానతలకు దూరంగా ఉండాలని, ప్రతి ఒక్కరూ ఇతరుల హక్కులను గౌరవించాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలు, మహిళలపై వివక్ష వంటి సామాజిక సమస్యలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. ఎవరైనా హక్కులకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే సంబంధిత అధికారులను ఆశ్రయించి చట్టపరమైన సహాయం పొందవచ్చని వివరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంద దిన, మండల డిప్యూటీ తహసీల్దార్ జి. ప్రభావతి, ఎస్సై పరమేశ్వర్, మండల గిర్దావర్ చీమన్ నాయక్, జీపీఓ దేవేందర్‌తో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బీజేపీ వరంగల్ జిల్లా ప్రొఫెషనల్స్ సెల్ కన్వీనర్‌గా నాండ్రె అమర్

వరంగల్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రొఫెషనల్స్ సెల్ కన్వీనర్‌గా ఖిలా వరంగల్ తూర్పుకోటకు చెందిన 37వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నాండ్రె అమర్ నియమితులయ్యారు. జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ఆదేశాల మేరకు ఈ నియామకం చేపట్టినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్ వెల్లడించారు.గత అసెంబ్లీ, పార్లమెంట్, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అమర్ అందించిన సేవలను గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, బీజేపీ రాష్ట్ర నాయకుడు, వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్ కుమార్ రావుకు అమర్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ప్రజలను భయపెట్టిన పులి బంధనం.. గ్రామస్థులకు ఊరట

చంద్రాపూర్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా చిమూర్ తాలూకా పలాస్‌గావ్ అటవీ ప్రాంతంలో ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న టి-179 (ఎస్ఎం-1) పులిని అటవీ శాఖ అధికారులు అక్టోబర్ 30న పట్టుకున్నారు. ఇటీవల ఉషా గురునులే అనే మహిళపై దాడి చేసి చంపిన ఈ పులిని అధికారులు మత్తుమందు ఇచ్చి బంధించారు. అనంతరం వైద్య పరీక్షలు, చికిత్స నిమిత్తం చంద్రాపూర్‌లోని ట్రీట్‌మెంట్ సెంటర్‌కు తరలించారు. పులి పట్టుబడటంతో పలాస్‌గావ్ పరిసర గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

దేశ ఐక్యత, సమగ్రతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





సూర్యాపేట, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పిలుపునిచ్చారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జాతీయ ఐక్యత దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో పటేల్ కీలక పాత్ర పోషించారని, స్వాతంత్ర్యం అనంతరం సంస్థానాల విలీనంలో ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమయ్యేలా ఆయన చేసిన కృషిని గుర్తుచేశారు. దేశ ఐక్యత, సమగ్రత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న వారితో కలెక్టర్ జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ప్రేమ్‌రాజ్, జడ్పీ సీఈవో శిరీష, డీఎస్ఓ మోహన్‌బాబు, ఆర్డీవోలు శ్రీనివాసులు, సూర్యనారాయణ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాసర సరస్వతి అమ్మవారి సన్నిధిలో మార్మోగిన రామనామ సంకీర్తనలు

- **కీతవారిగూడెం గ్రామానికి చెందిన భజన బృందాల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమం.**

గరిడేపల్లి, అక్టోబర్ 31,(ప్రజానేస్తం జ్వాల):



నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి పుణ్యక్షేత్రంలో కీతవారిగూడెం గ్రామానికి చెందిన భజన బృందాలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక భజన కార్యక్రమాన్ని నిర్వహించాయి. రెండు తెలుగు రాష్ట్రాల భక్త రామదాస భజన మండలి సొసైటీ అధ్యక్షులు మాన్యశ్రీ సిద్ధేశ్వర స్వామివారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కీతవారిగూడెం గ్రామానికి చెందిన శ్రీ సీతారామాంజనేయ భజన బృందం అధ్యక్షులు గూడూరు తిరుపతయ్య, శ్రీరామ భజన బృందం తరఫున జుట్టు కొండ నరసింహారావు, శ్రీ వెంకటేశ్వర భజన బృందం అధ్యక్షులు ముత్తినేని రామయ్య ఆధ్వర్యంలో భజన బృందాల సభ్యులు పాల్గొన్నారు.అమ్మవారి సన్నిధిలో భక్తి గీతాలు, శ్రీరామ నామ సంకీర్తనలు ఆలపిస్తూ ఆధ్యాత్మిక వాతావరణాన్ని నెలకొల్పారు. రామనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగగా, కీతవారిగూడెం గ్రామ భజన బృందాల భక్తి సేవలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.గ్రామీణ ప్రాంతాల్లో భజన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ, ఆధ్యాత్మిక చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించేందుకు భజన బృందాల

కాచవరగూడెంలో ఘనంగా శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవం

గరిడేపల్లి, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం కాచవరగూడెం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వర స్వామి దేవాలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు జనేగల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమ ఏర్పాట్లు జరిగాయి.ముఖ్య అతిథిగా హాజరైన గరిడేపల్లి మండల బీజేపీ అధ్యక్షుడు కుక్కడాపు వెంకటేశ్వర్లు గౌడ్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, శ్రీ కంఠమహేశ్వర స్వామి ఆశీస్సులు అందరికీ కలగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఉపాధ్యక్షుడు నర్సింగ్ నాగసైదులు, మేకపోతుల వీరప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రారంభోత్సవంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

నేరేడుచర్లలో ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవం

నేరేడుచర్ల, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మున్సిపల్ కేంద్రంలో ఏఐటీయూసీ 107వ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ ఏఐటీయూసీ సహాయ కార్యదర్శి ముత్యాల భాస్కర్ జెండాను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు, జిల్లా గౌరవాధ్యక్షుడు చిలకరాజు శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్, సీపీఐ సీనియర్ నాయకుడు బెల్లంకొండ గోవింద్ గౌడ్, ఇన్సాఫ్ నాయకుడు ఎస్కే సైదా కాసిం హాజరయ్యారు. అలాగే ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు పరికె భరత్, పట్టణ అధ్యక్షుడు వాడాల భాస్కర్, ఏఐటీయూసీ నాయకులు బండి శ్రీనివాస్, గోరుగంతం శ్రీనివాస్, వడ్డేగోని లింగయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

బీజేపీ వరంగల్ జిల్లా రజక కో-కన్వీనర్‌గా కాండ్రాతి శీను నియామకం

వరంగల్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 38వ డివిజన్‌కు చెందిన కాండ్రాతి శీనును భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా రజక కో-కన్వీనర్‌గా నియమించారు.ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్‌తో పాటు పార్టీ నాయకులకు కాండ్రాతి శీను కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

కల్తీ పాల తయారీ కేంద్రాలను గుర్తించి సీజ్ చేయాలి

భీమదేవరపల్లి, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



కెమికల్స్‌తో కృత్రిమ పాలు తయారు చేస్తూ ప్రజారోగ్యానికి ముప్పు కలిగిస్తున్న కల్తీ కార్యకలాపాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెప్యాల ప్రకాష్ డిమాండ్ చేశారు.పాలు, వంటనూనెలు, మసాలా దినుసులు తదితర నిత్యావసర ఆహార పదార్థాల్లో కల్తీని అరికట్టేందుకు అధికారులు నిరంతర తనిఖీలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు వినియోగించే పాలలో కల్తీ జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు.హోటళ్లు, స్వీట్ హౌస్‌లు, బార్ అండ్ రెస్టారెంట్లు, బిర్యానీ కేంద్రాల్లో ఆహార నాణ్యతను పరీక్షించాలని, కల్తీ కార్యకలాపాలు గుర్తించిన చోట నోటీసులతో సరిపెట్టకుండా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అవసరమైన చోట తయారీ కేంద్రాలను సీజ్ చేసి, నిబంధనల ప్రకారం లైసెన్సులు రద్దు చేయాలని కోరారు.ఫుడ్ సేఫ్టీ అధికారుల సంఖ్యను పెంచడంతో పాటు ప్రమాదకర రసాయనాల విక్రయాలపై నిఘా ఉంచాలని, ప్రజల ఫిర్యాదుల కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని చెప్యాల ప్రకాష్ ఒక ప్రకటనలో ప్రభుత్వాలను కోరారు.

పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమానికి స్పందన

పొనుగోడు, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమానికి పొనుగోడు గ్రామంలో స్పందన లభించిందని బీఆర్ఎస్ మాజీ మండల అధికార ప్రతినిధి రామ్ సైదులు తెలిపారు. గ్రామ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టభద్రుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేసిన అనంతరం గెజిటెడ్ అధికారి సంతకంతో సంబంధిత ఎమ్మార్వో కార్యాలయంలో అందజేసినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా రామ్ సైదులు మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు పట్టభద్రుల మద్దతు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల నాయకులు బిల్లా వెంకటేశ్వర్లు, వార్డు సభ్యులు అనంతు కరుణాకర్ గౌడ్, రామ్ మధు, నందిపాటి నరహరి, రామ్ సతీష్, పొలంపల్లి మహా ఆంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

NHM ఉద్యోగుల సమ్మెకు తుడుం దెబ్బ మద్దతు

ఆసిఫాబాద్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదుట చీనవీ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు తుడుం దెబ్బ జాతీయ అధ్యక్షుడు కోట్నాక విజయ్ కుమార్ సంఘీభావం ప్రకటించారు. సమ్మె 18వ రోజుకు చేరుకున్న సందర్భంగా ఆయన ఉద్యోగులను కలిసి మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా కోట్నాక విజయ్ కుమార్ మాట్లాడుతూ చీనవీ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం చేపట్టిన పోరాటానికి తమ సంఘం అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవా విజయ్, జిల్లా ముఖ్య సలహాదారు కనక ప్రభాకర్, ఉపాధ్యక్షుడు కోట్నాక రాంశావ్, వెడ్మ భగవంతరావు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ మడవి పురుషోత్తం, ఆదివాసీ యువ నాయకులు అడ సోమేశ్, కోట్నాక వినేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదుపై సమీక్ష సమావేశం

నడికూడ, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో నడికూడ మండల కేంద్రంలోని మారుతి గార్డెన్స్‌లో ఓటరు నమోదు ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గతంలో ఓటరుగా నమోదైన వారు సైతం నిబంధనల ప్రకారం తిరిగి నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.అర్హులైన పట్టభద్రులు ఎవరూ ఓటరు నమోదు ప్రక్రియకు దూరం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించాలని, ఎన్నికల నిబంధనలు, నమోదు విధానంపై వివరించాలని కోరారు.రాష్ట్ర నాయకుడు సాంబారి సమ్మారావు మాట్లాడుతూ అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరుగా నమోదు చేయించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి సహకార సంఘాల బలోపేతం: ఎమ్మెల్యే రేవూరి

ఆత్మకూరు , అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



రైతుల ఆర్థిక అభివృద్ధికి సహకార సంఘాలు కీలకమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం పెంచికలపేట పీఏసీఎస్ నూతన చైర్మన్ ఎగితే లింగయ్య, పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు, ఇతర సేవలు సకాలంలో అందించేలా నూతన పాలకవర్గం కృషి చేయాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని వ్యవసాయంలో నూతన పద్ధతులు అవలంబించాలని రైతులకు సూచించారు. క్లస్టర్ స్థాయిలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్లు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో జాతీయ ఐక్యతా పరుగు



సూర్యాపేట, అక్టోబర్ 31(ప్రజానేస్తం జ్వాల):

సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి, జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేటలో జాతీయ ఐక్యతా పరుగు నిర్వహించారు. ఎస్పీ ఇంజనీరింగ్ కళాశాల చౌరస్తా వద్ద ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ పరుగును ప్రారంభించి, విద్యార్థులు, యువత, పోలీసు సిబ్బందితో కలిసి పాల్గొన్నారు.ఎస్పీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి సద్దుల చెరువు మినీ ట్యాంక్ బండ్ వరకు పరుగు కొనసాగింది. అనంతరం పటేల్ చిత్రపటానికి నివాళులర్పించి, జాతీయ ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండి, లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడాలని సూచించారు. దేశ ఐక్యత, అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరసింహాచారి, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, యువత, శిక్షణ అభ్యర్థులు, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

కవిత వ్యాఖ్యలను ఖండించిన ఎమ్మెల్యే హరీశ్ బాబు



కాగజ్‌నగర్, అక్టోబర్ 31(ప్రజానేస్తం జ్వాల):

బీజేపీ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్నారంటూ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలను ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు ఖండించారు. కాగజ్‌నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్యేలపై నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రాణహిత--చేవెళ్ల ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసి, కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేశారని కేసీఆర్, రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు.

మాజీ కౌన్సిలర్ నందిగామ శంభయ్యకు పరామర్శ

హుజూర్‌నగర్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

హుజూర్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని మాధవరాయినిగూడెంకు చెందిన మాజీ కౌన్సిలర్ నందిగామ శంభయ్యను హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ శానంపూడి సైదిరెడ్డి పరామర్శించారు.ఇటీవల అనారోగ్యానికి గురై గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకున్న శంభయ్యను సైదిరెడ్డి కలిసి ఆయన ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స వివరాలు, ఆరోగ్య స్థితిగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా శంభయ్యకు ధైర్యం చెబుతూ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.అనారోగ్య సమయంలో పరామర్శించి ఆత్మీయంగా పలకరించిన సైదిరెడ్డికి శంభయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సన్నబియ్యం ధరలకు రెక్కలు.. సామాన్యుడి కంచంలో సెగలు!

హైదరాబాద్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

సామాన్యుడి నిత్యావసరమైన బియ్యం ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలపై ఆర్థిక భారం పెరుగుతోంది. ముఖ్యంగా సన్నబియ్యం ధర కిలో రూ.100 దాటిందనే పరిస్థితులు వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో బియ్యం కొరత ఏర్పడే అవకాశం ఉందనే ప్రచారాన్ని ఆసరాగా చేసుకుని కొందరు మిల్లర్లు, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.గత వానాకాలం సీజన్‌లో వరి ధాన్యం రికార్డు స్థాయిలో ఉత్పత్తి అయినప్పటికీ బియ్యం ధరలు తగ్గకపోవడం చర్చనీయాంశంగా మారింది. గోదాముల్లో, మిల్లుల్లో తగినంత ధాన్యం, బియ్యం నిల్వలు ఉన్నాయని చెబుతున్నప్పటికీ మార్కెట్లో ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎల్‌నినో పేరుతో ధరల పెంపు?

ఎల్‌నినో ప్రభావం కారణంగా రాబోయే వ్యవసాయ సీజన్‌లో వర్షపాతం, పంటల దిగుబడిపై ప్రభావం పడవచ్చనే అంచనాలను కొందరు వ్యాపారులు బియ్యం ధరల పెంపునకు కారణంగా చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి. భవిష్యత్తులో సన్నబియ్యం కొరత ఏర్పడుతుందనే ప్రచారంతో ముందుగానే నిల్వలు దాచిపెట్టి ధరలు పెంచుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది.

రైతుకు గిట్టుబాటు లేదు.. వినియోగదారుడికి అందుబాటులో బియ్యం లేదు

ఒకవైపు పంట పండించేందుకు రైతులు పెట్టుబడులు, కూలీలు, ఎరువులు, సాగునీటి సమస్యలతో సతమతమవుతున్నారు. మరోవైపు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించక ఇబ్బందులు పడుతున్నారు. రైతుల నుంచి తక్కువ ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్న మధ్యవర్తులు, మిల్లర్లు బియ్యంగా మార్చిన తర్వాత ధరలను నిర్ణయిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.ధాన్యం విక్రయించే సమయంలో రైతుకు ధర నిర్ణయించే అవకాశం



లేకపోగా, బియ్యం కొనుగోలు చేసే సమయంలో మాత్రం వ్యాపారులు నిర్ణయించిన ధరలకే వినియోగదారులు కొనాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ వ్యవస్థలో రైతులు, సామాన్య వినియోగదారులు ఇద్దరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ధరల నియంత్రణపై అధికారుల దృష్టి ఎప్పుడు?

బియ్యం నిల్వలు, హోల్‌సేల్, రిటైల్ ధరలు, గోదాముల్లో నిల్వల వివరాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టించడం, నిబంధనలకు విరుద్ధంగా ధరలు పెంచడం వంటి అంశాలపై తనిఖీలు నిర్వహించి తప్పులు తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.రైతుకు గిట్టుబాటు ధర లభించడంతోపాటు సామాన్యుడికి నాణ్యమైన బియ్యం అందుబాటు ధరల్లో లభించేలా ప్రభుత్వం, సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

భీమదేవరపల్లి, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాల లభ్యత తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు సాగు ప్రణాళికలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటలను ఎంపిక చేసుకోవాలని, వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని ఏఈవో సంపత్ తెలిపారు.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ అందుబాటులో ఉన్న నీటి వనరులను పొదుపుగా వినియోగించుకోవాలని, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రమోహన్, వార్డు సభ్యులు, ఏఈవో నాగరాజు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమం

- **వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలి: వ్యవసాయ శాఖ అధికారులు**

భీమదేవరపల్లి, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో భూగర్భ జలాల పరిరక్షణకు రైతులు సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. తక్కువ నీటితో పండే ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు.హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గొల్లపల్లి గ్రామంలో శనివారం కేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈవో సంతోష్ మాట్లాడుతూ.. యాసంగి సీజన్‌లో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటల సాగును పరిశీలించాలని సూచించారు.ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడంతో పాటు పీఎం కిసాన్ ఈ-కేవైసీ పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఈ ప్రక్రియలు అవసరమని



వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రమోహన్, ఉప సర్పంచ్ ఎల్లి రాజు, గట్లనర్సింగాపూర్ క్లస్టర్ ఏఈవో సంతోష్, రైతులు పాల్గొన్నారు.

38వ రోజుకు చేరిన తీన్మార్ మల్లన్న బీసీ రాజ్యాధికార యాత్ర

హనుమకొండ, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) అధినేత, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర 38వ రోజుకు చేరుకుంది. నల్లగొండ జిల్లా త్రిపురారం నుంచి మిర్యాలగూడ వైపు పాదయాత్ర కొనసాగుతోంది.యాత్రకు మద్దతుగా టీఆర్‌పీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పూజరి సత్యనారాయణ ఆధ్వర్యంలో హనుమకొండ, వరంగల్, గ్రేటర్ వరంగల్ ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు గత ఐదు రోజులుగా పాదయాత్రలో పాల్గొంటున్నారు. బీసీల హక్కుల సాధన లక్ష్యంగా సాగుతున్న యాత్రకు సంఘీభావం ప్రకటిస్తున్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పెండెల సంపత్, వర్కింగ్ ప్రెసిడెంట్ పుట్ట రాజు, జంగిలి శ్రీనివాస్, గట్టు నవీన్, ఫర్హాత్ నహిదా, బైరి రమేష్, జిల్లా కార్యదర్శి హేమలత, జయశ్రీ, తెలంగాణ కొమురయ్య, కొత్త అశోక్ కుమార్, కందికొండ

రాజు, భావు సింగ్, పూజిత, పద్మ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకుల నివాళులు

నేరేడుచర్ల, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ 42వ వర్ధంతి సందర్భంగా నేరేడుచర్ల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆమె చిత్రపటానికి మున్సిపల్ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొణతం చిన్న వెంకటరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల సందీప్ కుమార్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కట్టా రామారావు, మాజీ మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లం చెట్ల రమేష్ బాబు, మాజీ సర్పంచ్ ఆకారం వెంకటేశ్వర్లు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అనంత శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వెంకట సైదులు, కౌన్సిలర్లు తాళ్ల లావణ్య, సురేష్ రెడ్డి, యారవ లక్ష్మి, శ్రీనివాస్, ఇంజమూరి శ్రీకాంత్, నన్నెపంగా శ్రీనివాస్, పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సహకార సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్లపల్లి పాఠశాలలో జాతీయ ఐక్యత దినోత్సవం

నడికూడ, అక్టోబర్ 31(ప్రజానేస్తం జ్వాల):



సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని నడికూడ మండలం చర్లపల్లి ప్రాథమిక పాఠశాలలో జాతీయ ఐక్యత దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అచ్చ సుదర్శన్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశ ఐక్యత, సమగ్రత కోసం పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని, విద్యార్థులు ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో ఐక్యత ర్యాలీ నిర్వహించి, జాతీయ ఐక్యత ప్రతిజ్ఞ చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు లకావత్ దేవా, కంచ రాజ్ కుమార్, పుల్లూరి రామకృష్ణ, ప్రీ ప్రైమరీ టీచర్ బండి శ్వేత, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్గొండ క్రాస్‌రోడ్డులో సోహైల్ హోటల్ సీజ్

హైదరాబాద్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



హైదరాబాద్‌లోని నల్గొండ క్రాస్‌రోడ్డులో ఉన్న సోహైల్ హోటల్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు చేపట్టారు.శనివారం సాయంత్రం 4 గంటల నుంచి హోటల్‌లో తనిఖీలు నిర్వహించిన అధికారులు ఆహార భద్రతా ప్రమాణాల ఉల్లంఘనలను గుర్తించినట్లు తెలిపారు.ఈ నేపథ్యంలో హోటల్‌ను సీజ్ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించకూడదని హోటల్ యాజమాన్యానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అధికారుల చర్యలతో సోహైల్ హోటల్ ప్రస్తుతం మూతపడింది.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై బీజేపీ సమీక్ష

అర్హులందరినీ ఓటర్లుగా నమోదు చేయాలి: సంకినేని

సూర్యాపేట, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట నియోజకవర్గంలో ఓటర్ల నమోదును విస్తృతంగా చేపట్టాలని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే సంకినేని వెంకటేశ్వరరావు కోరారు. శనివారం బీజేపీ నియోజకవర్గ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేయించాలని, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజాదరణ కోల్పోతున్నాయని సంకినేని విమర్శించారు. తెలంగాణలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు.అంతకుముందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి చలమల నరసింహా, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో నవంబర్ 3న హుండీ లెక్కింపు

భీమదేవరపల్లి, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో నవంబర్ 3వ తేదీ మంగళవారం హుండీ లెక్కింపు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. కిషన్‌రావు తెలిపారు.ఆలయ ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో భక్తులు సమర్పించిన కానుకలు, మొక్కుబడుల నగదును లెక్కించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు హుండీ లెక్కింపునకు హాజరుకావచ్చని తెలిపారు. సంబంధిత అధికారుల సమక్షంలో పారదర్శకంగా లెక్కింపు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో వెల్లడించారు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

గ్రావెల్ అనుమతులకు ఆన్‌లైన్ పోర్టల్.. అధికారులకు శిక్షణ

హనుమకొండ, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

జిల్లాలో గ్రావెల్ (మట్టి) తవ్వకాలు, తరలింపునకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేసేందుకు సమగ్ర గ్రావెల్ నిర్వహణ విధానాన్ని అమల్లోకి తీసుకురానున్నట్లు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. ఈ విధానానికి సంబంధించిన పోర్టల్ వినియోగంపై శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.కొత్త పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఐదు రోజుల నుంచి వారం రోజుల్లోగా అనుమతులు మంజూరు చేసేలా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. చిన్న మొత్తాల్లో గ్రావెల్ అవసరమైన సందర్భాల్లోనూ అనుమతులు పొందే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు.సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సీజీజీ) ఈ పోర్టల్‌కు అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయనుంది. గ్రామస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు గ్రావెల్ తరలించే వాహనాల వివరాలు, రాకపోకల సమయాలను పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. ఈ విధానం ద్వారా అక్రమ తవ్వకాలు, తరలింపును నియంత్రించడంతో పాటు పారదర్శకత పెంపొందించవచ్చని కలెక్టర్ తెలిపారు.



రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల్లో శాయంపేట ఉపాధ్యాయుల ప్రతిభ

శాయంపేట, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అక్టోబర్ 28 నుంచి 30 వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి నాటిక, సంగీత, నృత్య పోటీల్లో శాయంపేట మండలానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ప్రతిభ కనబరిచారు. పత్తిపాక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు వారణాసి అంజనీ 'చేతిలో ప్రపంచం' లఘునాటికతో పాటు లలిత సంగీతం, బంజారా నృత్య ప్రదర్శనలో పాల్గొని నిర్వాహకుల నుంచి సన్మానం పొందారు. పెద్దకోడెపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సారంగపాణి జానపద గీతాన్ని ఆలపించి కల్చరల్ సెక్రటరీ యామిని కనకతార చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు.రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారి గడ్డం భిక్షపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరునగరి శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

హనుమకొండ--కరీంనగర్ మధ్య కొత్త బైపాస్ మీదుగా నాన్‌స్టాప్ డీలక్స్ బస్సులు

హనుమకొండ, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ నుంచి కరీంనగర్ వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ కొత్త బైపాస్ మార్గంలో నాన్‌స్టాప్ డీలక్స్ బస్సు సర్వీసులను ప్రారంభిస్తోంది. ఈ విషయాన్ని వరంగల్-1 డిపో మేనేజర్ పుష్పాల అర్పిత తెలిపారు. ఈ బస్సులు ప్రతిరోజూ హనుమకొండ బస్‌స్టేషన్ నుంచి ఉదయం 8:15, 8:55, 10:15, 11:35 గంటలకు బయలుదేరుతాయని పేర్కొన్నారు. టికెట్ ధర రూ.140గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రయాణికులు ఈ సర్వీసులను వినియోగించుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో కొత్త వెసులుబాటు

హనుమకొండ, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



సీబీఎస్ఈ 2028 పదో తరగతి బోర్డు పరీక్షల విధానంలో కీలక మార్పులు ప్రకటించింది. కొత్త విధానం ప్రకారం విద్యార్థులకు ఐదు తప్పనిసరి సబ్జెక్టులతో పాటు అదనపు స్కిల్ సబ్జెక్టును ఎంచుకునే అవకాశం ఉంటుంది.2026-27 విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ విధానం వర్తిస్తుంది. వీరు 2027-28 విద్యా సంవత్సరంలో పదో తరగతి బోర్డు పరీక్షలు రాయనున్నారు. గణితం, సైన్స్, సోషల్ సైన్స్‌లలో ఏదైనా ఒక సబ్జెక్టులో తప్పినప్పటికీ, బోర్డు పరీక్షగా నిర్వహించే స్కిల్ సబ్జెక్టులో ఉత్తీర్ణులైతే ఆ సబ్జెక్టుతో ఫెయిలైన సబ్జెక్టును భర్తీ చేసి ఫలితాన్ని లెక్కిస్తారు. అయితే ఈ వెసులుబాటు బోర్డు పరీక్షకు హాజరయ్యే గుర్తింపు పొందిన స్కిల్ సబ్జెక్టును ఎంచుకున్న విద్యార్థులకే వర్తిస్తుంది. పాఠశాల స్థాయి అంతర్గత మూల్యాంకనం ఉండే 'కౌశల్ వికాస్'ను ఎంచుకున్న వారికి ఈ అవకాశం ఉండదు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ నిబంధనలు వర్తించవు.

నిట్ టెక్నోజియాన్‌లో ఆకట్టుకున్న 'ఎకో సిటీ' ప్రదర్శన

వరంగల్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



నిట్ వరంగల్ జాతీయ సాంకేతిక ఉత్సవం 'టెక్నోజియాన్--26'లో సస్టైనబిలిటీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఎకో సిటీ' ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో ప్రకృతిని కాపాడుకుంటూ పర్యావరణహిత నగరాలను ఎలా నిర్మించవచ్చో విద్యార్థులు నమూనాల ద్వారా వివరించారు.సహజ వనరుల వినియోగం, వ్యర్థాల నిర్వహణ, సౌర విద్యుత్ వంటి అంశాలతో సుస్థిర పట్టణాభివృద్ధిపై అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నిర్వాహకులు సూచించారు.

నకిలీ ఎస్టీ ధ్రువీకరణ పత్రంతో ఉద్యోగం.. హనుమకొండ వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష

హనుమకొండ, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



నకిలీ ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రంతో ప్రభుత్వ ఉద్యోగం పొందిన హనుమకొండ జిల్లాకు చెందిన మోతుకు తిరుపతిరెడ్డికి సంబంధించిన కేసులో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. సట్లెజ్ జల విద్యుత్ నిగమ్ లిమిటెడ్‌లో అసిస్టెంట్ ఆఫీసర్‌గా పనిచేసిన ఆయన, నకిలీ ఎస్టీ సర్టిఫికెట్ సమర్పించినట్లు విచారణలో తేలడంతో 2005 ఆగస్టు 22న ఉద్యోగం నుంచి తొలగించబడ్డారు.ఈ కేసులో సిమ్లా ట్రయల్ కోర్టు విధించిన రెండేళ్ల సాధారణ జైలు శిక్షను హైకోర్టు సమర్థించింది. అయితే ఐపీసీ 467, 468 సెక్షన్ల కింద విధించిన శిక్షలను రద్దు చేసి, 420, 471 సెక్షన్ల కింద విధించిన శిక్షలను కొనసాగించింది. ఈ మేరకు 2026 సెప్టెంబర్ 25న జస్టిస్ రాకేశ్ కైన్థ్లా తీర్పు వెలువరించారు.

ఎంజీఎంలో మహిళ మృతి.. వైద్యుల నిర్లక్ష్యంపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు

వరంగల్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 55 ఏళ్ల నండ్రే రమాదేవి మృతి చెందారు. సకాలంలో సరైన వైద్యం అందకపోవడంతోనే ఆమె మరణించారని కుటుంబ సభ్యులు ఆరోపించారు.వరంగల్ ఏనుమాముల పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌కు చెందిన రమాదేవి అనారోగ్యంతో ఎంజీఎం ఆస్పత్రిలో చేరారు. అత్యవసర సమయంలో వైద్యులు సకాలంలో స్పందించలేదని ఆరోపిస్తూ ఆమె భర్త మట్టెవాడ పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. మృతికి గల కారణాలు, అందించిన వైద్య సేవలపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యం నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

భీమారానికి హనుమకొండ మహిళా పోలీస్ స్టేషన్ తరలింపు

హనుమకొండ, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ పైఅంతస్తులో కొనసాగుతున్న మహిళా పోలీస్ స్టేషన్‌ను భీమారంలోని నూతన భవనానికి తరలించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ తెలిపారు.కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ సమీపంలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంగణంలో ఈ నూతన భవనాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మహిళలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, కుటుంబ సమస్యలపై ప్రశాంత వాతావరణంలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఈ మార్పు చేసినట్లు వివరించారు .నవంబర్ 1 నుంచి మహిళా పోలీస్ స్టేషన్ సేవలు భీమారంలోని నూతన భవనం నుంచే అందుబాటులో ఉంటాయని సీపీ వెల్లడించారు.

మిషన్ వాత్సల్య పథకానికి 216 మంది లబ్ధిదారుల ఎంపిక

హనుమకొండ, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



హనుమకొండ జిల్లాలో మిషన్ వాత్సల్య పథకానికి 216 మంది అర్హులైన బాలబాలికలను ఎంపిక చేసినట్లు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో లబ్ధిదారుల తుది జాబితాను ఖరారు చేసినట్లు వెల్లడించారు.తల్లిదండ్రులు లేని పిల్లలు, దీర్ఘకాలిక ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న తల్లిదండ్రుల సంతానం, అత్యవసర రక్షణ అవసరమైన బాలబాలికలు తదితర ఏడు కేటగిరీల్లో క్షేత్రస్థాయి విచారణ చేపట్టి అర్హులను గుర్తించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఎంపికైన పిల్లలకు ప్రభుత్వం నుంచి నెలవారీ ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు.

వాతావరణ మార్పుల ప్రభావాన్ని అంచనా వేసే సూచిక రూపొందించిన నిట్ పరిశోధకులు

వరంగల్, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):



తెలంగాణలో గ్రామీణ రహదారులపై వాతావరణ మార్పుల ప్రభావాన్ని ముందస్తుగా అంచనా వేసేందుకు నిట్ వరంగల్ పరిశోధకులు ప్రత్యేక సూచికను రూపొందించారు. రాజిరెడ్డి మైకాల, శంకర్ సబావత్ సంయుక్తంగా 'ఎల్వీఆర్ఏఐ' (LVRAI) పేరుతో ఈ సూచికను అభివృద్ధి చేశారు. జీఐఎస్ సాంకేతికత ఆధారంగా అధిక వర్షపాతం, ఆకస్మిక వరదలు, తీవ్రమైన ఉష్ణోగ్రతలు, రహదారుల నిర్మాణ పరిస్థితులు, గ్రామీణ ప్రజల రాకపోకలను విశ్లేషించి ఈ సూచికను రూపొందించారు. 2050 నాటికి ఎదురయ్యే వాతావరణ ముప్పులను అంచనా వేయడం ద్వారా మన్నికైన గ్రామీణ రహదారుల నిర్మాణం, దీర్ఘకాలిక నిర్వహణకు ఇది ఉపయోగపడుతుందని పరిశోధకులు తెలిపారు.

ట్రైసిటీలో 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమం ప్రారంభం

హనుమకొండ, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

నేరాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో 'కమ్యూనిటీ కనెక్ట్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు ప్రజల ఇళ్ల వద్దకు వెళ్లి సైబర్ మోసాలు, మహిళలు, చిన్నారుల భద్రత, ఇళ్ల దొంగతనాల నివారణ, గంజాయి, మత్తు పదార్థాల దుష్ప్రభావాలు, సోషల్ మీడియా ఖాతాల భద్రతపై అవగాహన కల్పించనున్నారు. కాలనీల్లో సీసీ కెమెరాల ఏర్పాటు ఆవశ్యకతను కూడా వివరిస్తారు.పైలట్ ప్రాజెక్టుగా తొలుత నగర పరిధిలోని తొమ్మిది కీలక పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు సీపీ వెల్లడించారు.



కోదాడలో 120 కిలోల గంజాయి పట్టివేత

కోదాడ, అక్టోబర్ 31 (ప్రజానేస్తం జ్వాల):

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణ పరిధిలోని దుర్గాపురం స్టేజి వద్ద శనివారం సాయంత్రం పోలీసులు తనిఖీలు నిర్వహించి 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి నుంచి కేఏ 03 ఎంజే 4712 నంబరు గల కారులో గంజాయిని బెంగళూరుకు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వాహనాన్ని అడ్డుకున్నారు. కారులో తనిఖీలు నిర్వహించి గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.గంజాయిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? ఎవరికి సరఫరా చేసేందుకు తరలిస్తున్నారు? అనే కోణాల్లో పోలీసులు విచారణ చేపట్టారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

